క్లుప్తంగా

ఆధార్ కేంద్రం ఏర్పాటు



మక్తల్: పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో నాలుగు ఆధార్ కేంద్రాలను సోమవారం ఏర్పాటు చేశారు. రెండు నెలల క్రితం ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి మేరకు కలెక్టర్ చర్యలు చేపట్టారు. దీంతో ప్రజలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



మరికల్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటు కోసం సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోవర్ధన్ మాట్లాడుతూ యువక మండలి, అఖిలపక్షం, విద్యార్థి సంఘాలు, గ్రామస్తులు, దాతల సహకారంతో 10 ఫీట్లు, 600 కిలోల కాంస్య విగ్రహం ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పూజారి శ్రీనివాసశర్మ, రవి కిరణ్, మల్లయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్ సుభానీ ఉర్సు



మాగనూర్: మండలంలోని గురవలింగంపల్లిలో మహబూబ్ సుభానీ ఉర్సును ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామస్తులు దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. కులమతాలకు అతీతంగా నిర్వహించే పండుగా మహబూబ్ సుభాని ఉర్సు అని తెలిపారు. మహోత్సవంకు మండల ప్రజలతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్య హాజరయ్యారు.

ముగ్దుంసాబ్ ఉర్సు

ఊట్కూరు: మండలంలోని ముగ్దుంపూర్‌లో సోమవారం ముగ్దుంసాబ్ ఉర్సును గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మేకలు, గొర్రెలతో కందూర్లు చేపట్టారు. మండల నాయకులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సిద్ధలింగేశ్వర స్వామికి సన్మానం



మాగనూర్: అయోధ్య శ్రీరామచంద్ర భగవాన్ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మండలంలోని నేరడగం పీఠాధిపతి పంచమ సిద్ధ లింగ మహాస్వామిని శ్రీరామ తీర్థ ట్రస్ట్ ఆహ్వానించింది. స్వామీజీకి ఆహ్వానం అందడంతో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి మందరినాథ్, జగదీశ్వర్, బాలస్వామి సోమవారం స్వామివారిని ఘనంగా సన్మానించారు. వారికి రాముల వారి అక్షతలు అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



కోస్గి: కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి సారి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పూజా కార్యక్రమంతోపాటు కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) కార్యాలయాన్ని ప్రారంభించారు. కోస్గి మండలానికి మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయురాలికి ఘన నివాళి



మక్తల్: మండలంలోని రుద్రసముద్రం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సునీత ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అనిల్‌గౌడ్, నాగార్జున, భీంరెడ్డి, రవీందర్, శ్రీనివాస్, అనిల్‌రెడ్డి, గోపాల్, కృష్ణయ్య, వెంకటేష్, అరుణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

చెరువు కబ్జాను అడ్డుకోండి

- మంత్రోనిపల్లి గ్రామస్తుల వేడుకోలు

ధన్వాడ: ఆ ఊరిలో మొత్తం ముదిరాజుల కుటుంబాలు నివసిస్తున్నారు. వీరంతా ఊరి చెరువులో పెంచే చేపలు పట్టుకుని అమ్మకాలు చేసి జీవిస్తారు. కానీ ఇప్పుడు వారు చేపలు పెంచే చెరువు కబ్జాకు గురైంది. మండలంలోని మంత్రోనిపల్లిలో ఉన్న చెరువును ప్రస్తుతం కొంతమంది చదును చేసి పంటలు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఇటీవల పనులను నిలిపివేశారు. గురువారం పనులు ప్రారంభించి చెరువులో రెండు బోర్లను కూడా వేశారు. గ్రామస్తులు అందరూ కలిసి శనివారం తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ముదిరాజుల సంఘం తరుపున ప్రతి సంవత్సరం మత్స్య సహకార సంఘానికి డబ్బులు చెల్లిస్తున్నారు.



చెరువులో ఏర్పాటు చేసిన బోరును చూపిస్తున్న గ్రామస్తులు

మొత్తం 16 ఎకరాలు..

చెరువులో మొత్తం 16 ఎకరాల భూమి ఉంది. ఇది గున్ముక్ల గ్రామ కన్నమయ్య రాంచంద్రయ్యకు చెందిందిగా గ్రామస్తులు చెబుతున్నారు. 40ఏళ్ల క్రితం ఇందులో 8 ఎకరాలు అమ్మారు. మిగిలిన 8 ఎకరాల భూమిని గ్రామ చెరువు కోసం అందించాలని ఆయనను కోరారు. దీంతో గ్రామస్తులు అందరూ కొంత డబ్బులను వేసి అప్పట్లో అడ్వాన్స్ కింద రూ.80 వేల వరకు అందజేశారు. ఇందులో కొంత మంది ఆరు ఎకరాల దాక డబ్బులను ఇచ్చి తమ పేర్ల మీదకు మార్పులు చేసుకున్నారు. మిగిలిన రెండు ఎకరాలు కర్నమయ్య అయిన రాంచంద్రయ్య పేరుపైన ప్రస్తుతం ధరణిలో చూపిస్తుంది.

చెరువులను ఏర్పాటు ఇలా..

నీరు నిలిచే ప్రదేశాన్ని చెరువుగా ఇరిగేషన్ శాఖ అధికారులు మార్చారు. మంత్రోనిపల్లి చెరువు ఏర్పాటు చేసేందుకు చుట్టూ కట్టను ఏర్పాటు చేసి తూములను నిర్మించారు. చెరువుపై కట్ట నిర్మించాలంటే ఇరిగేషన్ అధికారులు భూమి ప్రభుత్వానిదా? లేక పట్టాదారులదా అనే విషయాలను పరిశీలించి పట్టదారుడిది అయితే అందుకు నష్టపరిహారం చెల్లించి చెరువు కట్టను ఏర్పాటు చేశారు. అప్పుడు ఆ భూమి ఇరిగేషన్ అధికారుల పరిధిలో ఉంటుంది. అలాంటి భూమికి పట్టాపాసు పుస్తకాలు ఎలా ఇస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

చెరువే ఆధారం..



చెరువుపై మా కుటుంబాలు ఆధారపడ్డాయి. ఈ చెరువు నిండితే దాదాపు 150 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. చెరువుపై ఆధారపడి బోర్లు నడుస్తున్నాయి. ఇప్పుడు చెరువే లేకపోతే జీవనోపాధి కోల్పోతాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– తిమ్మయ్య, మంత్రోనిపల్లి

పనులు ఆపాలని సూచించాం..

మంత్రోనిపల్లి గ్రామ చెరువులో ఎలాంటి పనులు చేపట్టకూడదని సూచించాం. మొత్తం భూమిని సర్వే కోసం పెట్టాం. సర్వే చేసిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయి.

– సింధూజ, తహసీల్దార్, ధన్వాడ

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్

మద్దూరు: మద్దూరు, కొత్తపల్లి మండలాల్లోని 49 పంచాయతీలను నుంచి వచ్చిన ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు సోమవారం మద్దూరులోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ నమోదు చేపట్టారు. రెండు మండలాలకు కలిపి 20,253 దరఖాస్తులు వచ్చాయని, వీటిని 40 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లతో ఆన్‌లైన్ చేస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.



ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న ఆపరేటర్లు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మద్దూరు: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా ఏబీవీపీ అధ్వర్యంలో సోమవారం జూనియర్ కళాశాల ఆవరణలో కళాశాల, పాఠశాలల విద్యార్థులకు 'స్వామి వివేకానంద జీవిత చరిత్ర' పై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి ఈ నెల 12న నిర్వహించే జయంతి ఉత్సవాల్లో బహుమతులను అందజేయనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అరుణ్‌గౌడ్, అనిల్‌యాదవ్, భాస్కర్, లాలు, గణేష్, శ్రీనివాస్, రఘు, సాయిలు, భరత్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

దొంగలు తలుపులు తడుతున్నారని ఫిర్యాదు

ఊట్కూర్: మండల కేంద్రంలో పలుకాలనీలలో రెండు రోజులుగా రాత్రి వేళలో దొంగలు తలుపులు తడుతున్నారని ఆదివారం రాత్రి గ్రామస్తులు సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దపీర్ల గడ్డవీధి, గాంధీనగర్, ఎల్‌బీ.నగర్ వీధుల్లో అర్ధరాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు, హిందీలో మాట్లాడుతూ తలుపులు తట్టి పరుగెడుతున్నారని, దీంతో గ్రామంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ గోకారిని వివరణ కోరగా గ్రామంలో ముందు జాగ్రత్తగా ప్రత్యేక పోలీసుల బృందాలతో గస్తీ ఏర్పాటు చేశామని, ప్రజలు భయాందోళనలకు గురికావద్దని తెలిపారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



ఊట్కూరు: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ క్యాలండర్‌ను విష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి ఎల్కోటి లక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఉపాధ్యాయులు చిన్నారులకు బంగారు భవిష్యత్‌ను అందించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎల్లాగౌడ్, లక్ష్మారెడ్డి, రమేష్, వెంకటయ్య, శ్రీనివాసులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

మాగనూర్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండగా.. మరో వైపు జీవాలకు, ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. మండలంలోని కొత్తపల్లి ప్రధాన రహదారి వెంట ఉన్న సంగంబండ కుడి లోలెవల్ కెనాల్ సమీపంలో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో వైర్ల సాయంతో నిలబడింది. ప్రస్తుతం యాసంగి వ్యవసాయ పనులు వేగంగా జరుగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని రైతులు వాపోతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి సమస్య పరిష్కారించాలని కోరుతున్నారు.

బ్రిడ్జి మరమ్మతులు వాయిదా

కృష్ణ: మండలంలోని చెక్‌పోస్టు వద్ద కృష్ణానదిపై నిర్మించిన పురాతన వంతెన మరమ్మతుల కారణంగా కర్ణాటక ప్రభుత్వం ఈనెల 10వ తేదీ నుంచి వంతెన బంద్ చేస్తున్నట్లు ప్రకటించింది. కృష్ణ జాతరను దృష్టిలో ఉంచుకుని వారం రోజులు మరమ్మతుల పనులను వాయిదా వేయాలని గ్రామస్తులు సోమవారం రాయచూర్ కలెక్టర్, రూరల్ ఎమ్మెల్యే దద్దల్ బస్సన్‌గౌడ్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, కలెక్టర్‌లు వంతెన మరమ్మతు పనులను ఈ నెల 16వ తేదీ వరకు వాయిదా వేసినట్లు తెలిపారు.

పంట భూములకు డిమాండ్

- పట్టణాల్లో స్థలాలను కాదని వ్యవసాయ భూముల వైపు ఆసక్తి
- ఫలితంగా పెరుగుతున్న ధరలు

మాగనూర్: వ్యవసాయ భూములకు డిమాండ్ పెరుగుతుంది. ఒకప్పుడు దేనికి పనికి రావనుకున్న భూములే ఇప్పుడు కాసులు కురిపిస్తున్నాయి. ఎంతోకొంత ఆర్థికంగా బలంగా ఉన్న వారి నుంచి కోటీశ్వరులు సైతం పంట భూముల వైపు చూస్తున్నారు. ఈ మధ్య కాలంలో మక్తల్ నియోజకవర్గంలో పంట భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.



మాగనూరులో పంట భూములను సర్వే నిర్వహిస్తున్న కొనుగోలుదారులు

రక్షణ లేకపోవడం కూడా కారణం..

ధనిక, మధ్య తరగతి వర్గాలతో పాటు రోజువారి పనులు చేసుకుని కాస్తోకూస్తో కూడబెట్టుకున్న వారు సైతం తమకు చేతనైనంత పంట భూమినే కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నారు. పట్టణాల్లో స్థలాలు కొనాలంటే ధరలు భరించలేని పరిస్థితి. పైగా ప్లాట్లు కొంటే రక్షణ లేకపోవడం మరో కారణంగా కనిపిస్తుంది. ఇటీవల కాలంలో కబ్జాలు మరీ ఎక్కువగా అయిపోయాయి. అదేకాకుండా ఒక్కో స్థలాన్ని ఇద్దరు, ముగ్గురికి అమ్మిన దాఖలాలు కూడా వెలుగు చూస్తున్నాయి. వెంచర్లలో ప్లాట్లను చూసే వారికంటే గ్రామాల్లో సాగు భూములు చూసే వారి సంఖ్యే పెరుగుతోందని మధ్యవర్తులు సైతం అంటున్నారు.

ధరలను దృష్టిలో పెట్టుకొని..

మాగనూర్, మక్తల్, నర్వ, కృష్ణ మండలాల్లో పంట భూముల క్రయవిక్రయాలు వేగంగా జరుగుతున్నాయి. మక్తల్‌లో 250 గజాల ప్లాటు కొనాలంటే రూ.25 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు ఉంది. దానికి బదులు పంట భూములు కొంటే ఏకంగా ఒకటి నుంచి రెండు ఎకరాలు వస్తుంది. ఈ నేపథ్యంలో చాలా మంది పంట భూములు కొనుగోళ్లపై దృష్టి పెట్టారు. జిల్లా కేంద్రంలో ఎకరం రూ. కోటి నుంచి రూ.రెండు కోట్ల వరకు పలుకుతుంది. ఇక గ్రామాల్లో కూడా ఇప్పుడిప్పుడు ధరలు పుంజుకుంటున్నాయి. ఒకప్పుడు ఎకరం రూ.7 లక్షల నుంచి రూ. 8 లక్షలు ఉన్న భూములు ఇప్పుడు రూ. 20 లక్షల నుంచి రూ. 22 లక్షల వరకు పలుకుతోంది. ఇలా పల్లెల్లో భూముల ధరలు పెరిగిపోతుండటంతో వ్యవసాయం చేసే వారు ఇబ్బంది పడుతున్నారు. పట్టణాల నుంచి వచ్చిన వారు రూ.లక్షలు పెట్టి భూముల ధరలను పెంచేస్తున్నారని, తాము కొనాలంటే అంత ధరలను పెట్టలేమని వాపోతున్నారు.

పథకాలు అందుతుండటంతో..

వ్యవసాయ భూముల కొనుగోలు చేస్తే ప్రభుత్వ పథకాలు కూడా వర్తిస్తుండటంతో ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు ద్వారా ఎకరాకు రూ.5 వేలు ఇస్తుంది. అలాగే కేంద్రం పీఎం కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా రూ.6 వేలు ఇస్తుంది. దీనికి తోడు పంట భూములుపై బ్యాంకు రుణాలు ఉన్నాయి. ఒకవేళ భూమి కౌలుకు ఇచ్చుకున్నా ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వరకు వస్తుంది. ఇవన్ని ప్రయోజనాలు, భూమి రక్షణను దృష్టిలో పెట్టుకొనే వ్యవసాయ భూముల వైపు మొగ్గు చూపుతున్నారు.

పట్టణాల నుంచి పల్లెలకు..



చాలా మంది ప్రస్తుతం పట్టణాలను వదిలి పల్లె బాట పట్టారు. ఎందుకంటే అక్కడ వారు ఎకర భూమిని రూ.కోట్లకు అమ్మి ఇక్కడ పది ఎకరాల వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో వ్యవసాయ భూములు చాలా ఖరీదుగా మారాయి.

– సుధాకర్‌రెడ్డి, రైతు, వద్వాట్

రిజర్వాయర్ రావడంతో..



గ్రామీణ ప్రాంతాలలో రైతులు అధికంగా భూములను అప్పుల బాధతో అమ్ముతున్నారు. అయితే ప్రస్తుతం మా దగ్గర సంగం బండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కారణంగా కూడా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. పల్లెటూరిలో సైతం భూములు కొనలేని స్థితికి ధరలు చేరుకున్నాయి.

– వెంకటేష్, రైతు, ఉజ్జెల్లి

గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

నారాయణపేట రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మండలంలోని బండగొండలో మల్లయ్యస్వామి దేవాలయానికి మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి సొంత డబ్బులతో వేయించిన బోరును సోమవారం ఆమె ప్రారంభించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేస్తామని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన లోపాలను సరిచేస్తూ అన్ని రకాలుగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తామన్నారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాలుగా పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట సదాశివరెడ్డి, బండివేణుగోపాల్, రాంచందర్, అఖిల్‌రెడ్డి, సందీప్, అంజిరెడ్డి పాల్గొన్నారు.



బండగొండలో బోరు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళాబృందం

మాగనూర్: విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ గోపికృష్ణ అన్నారు. మండలంలోని వద్వాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలు, విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కారాదని సూచించారు. చదువుపై శ్రద్ధ కనబర్చాలని, ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. వాహనదారులు రోడ్డుపై వెళ్తునప్పుడు పరిమిత వేగంలో వెళ్లాలని, తప్పకుండా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని అన్నారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, రుఖ్యానాయక్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు ఇసుక అక్రమ రవాణా

కోస్గి: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఇసుకను రవాణా చేస్తున్నప్పటికి మండలంలోని అక్రమ దందా విచ్చలవిడిగా కొనసాగుతుంది. పట్ట పగలు ఏకంగా జేసీబీతో టిప్పర్‌లో ఇసుకను రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సోమవారం మండలంలోని బిజ్జారం-కడంపల్లి మధ్య ఉన్న వాగులో నుంచి టిప్పర్‌లో ఇసుకను హన్మాన్‌పల్లి మీదుగా తరలించారు. ఈ విషయంలో పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని సమీప పొలాల రైతులు వాపోతున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లోనే కొన్ని ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కనుసన్నల్లో ఈ దందా కొనసాగుతుందనే వాదనలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.



టిప్పర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఊట్కూర్: ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో 17,920 దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఆన్‌లైన్ చేస్తున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుపేదలకు రేషన్ కార్డులు అందిస్తామన్నారు. గృహలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకం ద్వారా పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. విద్యుత్ అధికారులు సబ్ స్టేషన్‌లో అందుబాటులో ఉండడం లేదని, అత్యవసర సరిస్థితుల్లో ఫోన్ సదుపాయం లేదని కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహిమాన్ తెలిపారు. ఫోన్ సదుపాయం కల్పించాలని ఎంపీపీ ఏఓ వెంకటేష్‌కు ఆదేశించారు. మండలంలో 60 అంగన్‌వాడీ కేంద్రాలు, 9 మినీ కేంద్రాలు కొనసాగుతున్నాయని, మినీ కేంద్రాలను, మెయిన్ కేంద్రాలుగా గుర్తించాలని ప్రభుత్వం ద్వారా జీఓ వచ్చిందని ఇన్‌చార్జ్ సీడీపీఓ శ్రీలత తెలిపారు. పెద్దజట్రంలోని రైతువేదిక భవనం పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఇప్పటి వరకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదని ఎంపీటీసీ కిరణ్‌కుమార్ తెలపగా, వెంటనే పనులను పూర్తిచేయించాలని ఏఈ జగత్‌చంద్రకు ఎంపీపీ ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, ఎంపీడీఓ రమేష్‌కుమార్, ఎంఈఓ వెంకటయ్య, పశు వైద్యాధికారి అశోక్, ఏఓ గణేష్‌రెడ్డి, డాక్టర్ భవాని, సభ్యులు పాల్గొన్నారు.

కాల్వ పక్కన తవ్వకాలు

ధన్వాడ: మండలంలోని గోటూర్ శివారులో కోయిల్‌సాగర్ కుడి కాల్వ పక్కన కొంత మంది పొక్లెయినర్‌తో తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోయిల్‌సాగర్ కాల్వలకు ఇరువైపుల పట్టదారులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి కొనుగోలు చేసిందని, ఇప్పుడు కాల్వకు కొద్దిపాటి స్థలాన్ని వదిలేని తవ్వకాలు చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. కొన్ని నెలల క్రితమే ప్రభుత్వ నిధులతో కాల్వ మరమ్మతులు చేశారు. ఇప్పుడు తవ్వకాలు చేయడం వల్ల కాల్వ మందం తగ్గి తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాల్వను పరిశీలించాలని కోరుతున్నారు.



కోయిల్‌సాగర్ కుడి కాల్వ పక్కన తవ్వకాలు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

నారాయణపేట రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 8నెలల బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ డీఈఓ కార్యాలయంలో సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ.. భోజన కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలని, రాజ్యాంగాన్ని అవమానించరాదన్నారు. సమయానికి బిల్లులు అందించకపోతే అప్పుల ఊబిలో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కోడిగుడ్ల డబ్బులు సైతం చెల్లించకపోవడంతో దుకాణదారులు సరుకులు ఇవ్వడంలేదన్నారు. కార్యక్రమంలో పద్మమ్మ, నర్సింహ, గౌరమ్మ పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతలు

నర్వ: శ్రీరామ అక్షతల వితరణ కార్యక్రమం రాంపూర్‌లో సోమవారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి అక్షతలను, రామ మందిర ఫొటో, కరపత్రాలను అందించారు. 22న అయోధ్యలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన, రామ మందిరం ప్రారంభం రోజున ఆలయాలకు అలంకరణ, ప్రత్యేక పూజలు, ప్రతి ఇంటిలో ఐదు దీపాలను వెలిగించి పండుగల నిర్వహించుకోవాలని కోరారు.

శబరిమలకు బయలుదేరిన భక్తులు

మద్దూరు: నియమనిష్ఠలతో అయ్యప్ప మాల ధారణ చేసిన భక్తులు సోమవారం శబరిమలకు బయలుదేరివెళ్లారు. మండలంలోని చెన్వార్ చెందిన రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి దేవాలయంలో ఇరుముడులను కట్టారు. మేళతాళాల మధ్య గ్రామం నుంచి గ్రామస్తులు సాగనంపారు.